CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 35 పేజీలు :8+12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప ఆదివారం 12 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 35 PAGES :8 +12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA SUN 12 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# నెల్లూరు మైపాడు గేట్ సెంటర్ లో స్మార్ట్ స్ట్రీట్...

## వర్చువల్ గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- ద్వాక్రా మహిళలే యజమానులు... నెల్లూరులో అందుబాటులోకి స్మార్ట్ స్ట్రీట్
- 30 కంటైనర్లలో 120 దుకాణాలు
- 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద కేటాయింపు
- సోలార్ విద్యుత్, ఫ్రీ వైఫై, సీసీ కెమెరాల వంటి ఆధునిక సౌకర్యాలు
- రాష్ట్రంలోని ఇతర నగరాలకూ ఈ నమూనాను విస్తరిస్తామన్న మంత్రి నారాయణ




పెన్ పవర్ డెస్క్:ద్వాక్రా సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెల్లూరు నగరంలో ఒక వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టింది. మైపాడు గేట్ సెంటర్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 'స్మార్ట్ స్ట్రీట్'ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా 30 ప్రత్యేక కంటైనర్లను ఉపయోగించి మొత్తం 120 దుకాణాలను ఏర్పాటు చేశారు. 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద ఈ దుకాణాలన్నింటినీ పూర్తిగా ద్వాక్రా సంఘాల మహిళలకే కేటాయించారు. వీటిలో ఫుడ్ స్టాల్స్, నగల దుకాణాలు సహా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, లబ్ధిదారులైన మహిళలతో వీడియో లింక్ ద్వారా నేరుగా మాట్లాడి వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఇలాంటి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఈ స్మార్ట్ స్ట్రీట్ అనేక ప్రత్యేకతలతో రూపుదిద్దుకుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడ పూర్తిగా సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తారని, వినియోగదారుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరులో విజయవంతమైన ఈ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని మిగతా నగరాల్లోనూ ఇలాంటి స్మార్ట్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా...

### అధికారులకు కీలక ఆదేశాలు



- అస్వస్థతకు గురైన బీసీ హాస్టల్ విద్యార్థులు
- మంత్రి సవిత, అధికారులతో సీఎం చంద్రబాబు ఫోన్‌లో సమీక్ష
- గుంటూరు జీజీహెచ్‌లో 24 మందికి చికిత్స
- ఒక విద్యార్థిని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలింపు
- ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలకు సీఎం ఆదేశం
- తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసా

పెన్ పవర్ డెస్క్:గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మంత్రి సవిత, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వారిలో ఒక విద్యార్థికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో, మెరుగైన వైద్యం

వివరాలు 2లో..

## అవన్నీ వట్టి పుకార్లే

- కర్ణాటక మంత్రివర్గ విస్తరణపై వస్తున్న వార్తలన్నీ వదంతులేనని స్పష్టీకరణ
- నిరాధార వార్తలను ప్రచురిస్తున్నాయంటూ మీడియాపై డీకే అసహనం
- అక్టోబర్ 13న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎం సిద్ధరామయ్య విందు సమావేశం
- కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో వాల్మీకి వర్గానికి మంత్రి పదవి ఇస్తామని సీఎం హామీ
- స్థానిక ఎన్నికలపై చర్చించేందుకే ఆ విందు అన్న శివకుమార్



పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ లేదా మార్పులపై గత కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచారానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెరదించారు.

వివరాలు 2లో..

## బొత్స ఈ మధ్య బాగా ఫోకస్ అవుతున్నారు...

### ఆయనకు జగన్ నుంచే ప్రాణహాని ఉంది



- తనకు ప్రాణహాని ఉందన్న బొత్స
- జగన్ ను మించి ఎవరైనా ఎదిగితే అంతేనన్న పల్లా శ్రీనివాసరావు
- అవసరమైతే బొత్సకు ప్రభుత్వ భద్రత కల్పిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు వారి పార్టీ అధినేత జగన్ నుంచే ప్రాణహాని ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. తనకు ప్రాణహాని ఉందని స్వయంగా బొత్స ప్రకటించిన నేపథ్యంలో,

వివరాలు 2లో..

## పొత్తుకు నో అన్నారని... బీహార్‌లో భారీ ప్లాన్‌తో బరిలోకి ఒవైసీ ఎంఐఎం పార్టీ!



- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం సంచలన నిర్ణయం
- ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రణాళిక
- 'ఇండియా' కూటమి నుంచి పొత్తుకు స్పందన కరవు
- రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యం
- గత ఎన్నికల్లో ఐదు స్థానాలు గెలుచుకున్న ఎంఐఎం

వివరాలు 2లో..

## మంత్రి పొంగులేటిపై ఖర్గేకు ఫిర్యాదు చేసిన కొండా మురళి

- మేడారం పనులను సొంత కంపెనీకి ఇప్పించుకుంటున్నారని విమర్శ
- సోనియా, రాహుల్ గాంధీలతో పాటు మీనాక్షి నటరాజన్‌లకు ఫిర్యాదు
- అధిష్ఠానం నుంచి సానుకూల స్పందన వచ్చిందన్న కొండా మురళి



పెన్ పవర్ డెస్క్:వరంగల్ రాజకీయాల్లో మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుం టున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కొం డా మురళి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి

వివరాలు 2లో..

## దళితులను రెచ్చగొట్టేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు



- చిత్తూరు జిల్లా దేవళంపేటలో హోంమంత్రి అనిత పర్యటన
- దగ్ధమైన అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించిన మంత్రి
- నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక

వివరాలు 2లో..

## భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే అలా కూడా చేయండి

### నరేంద్ర మోదీ పిలుపు

- ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలన్న ప్రధాని
- దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులది ముఖ్య పాత్ర అని వ్యాఖ్య
- ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన వద్ద పండించాలన్న మోదీ



వివరాలు 2లో..

## చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా అసాధారణంగా పెరుగుతోంది

- దేశంలో కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పులకు చొరబాట్లే కారణమన్న అమిత్ షా
- కొన్ని పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపణ
- అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా అసాధారణ వృద్ధి అని వెల్లడి
- చొరబాట్లు దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా అభివర్ణన
- సరిహద్దు భద్రతలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తప్పనిసరి అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్: దేశంలోని కొన్ని ప్రాంతాలలో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దైనిక్ జాగరణ్' మాజీ సంపాదకుడు నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ మేరకు మాట్లాడారు.కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా తన వాదనను వినిపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అసోంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగిందని, చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా పశ్చిమ

వివరాలు 2లో..

## దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం...

### ఐదు జిల్లాలకు అలర్ట్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన

వివరాలు 2లో..

## నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

### ఏపీలో మొట్టమొదటి ఏఐ డేటా సెంటర్ కు శంకుస్థాపన



- డేటా సెంటర్ల హబ్ గా విశాఖ
- సిఫీ సంస్థ రూ.1500 కోట్ల భారీ పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు
- ఏఐ ఆధారిత డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్
- గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా మారనున్న విశాఖ

వివరాలు 2లో..

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి

- లక్ష్మీ పురి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన పవన్
- పుస్తకాలు చదవడం వల్లే మానసిక పరిపక్వత వస్తుందన్న పవన్
- పవన్ కల్యాణ్ తన అభిమాన నాయకుడని చెప్పిన మంత్రి సత్యకుమార్



వివరాలు 2లో..

# దళితులను రెచ్చగొట్టేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు

చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు దహనం చేసిన ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ చర్య వెనుక రాజకీయ కుట్ర ఉందని, దళితులను రెచ్చగొట్టేందుకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. శనివారం దేవళంపేటలో పర్యటించిన మంత్రి, అగ్నికి ఆహుతైన అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, "అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను త్వరలోనే పట్టుకుని కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక కొందరు కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో జరిగిన డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనితా రాణి ఘటనలపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. సమాజంలో నేరాలకు పాల్పడే వ్యక్తులు రాజకీయ ముసుగు వేసుకుని తిరుగుతున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్రదారులను చట్టం ముందు నిలబెడతామని ఆమె హామీ ఇచ్చారు.

## ఎడిటర్ వ్యూ

## లీడర్లు సరే... కేడర్ సంగతేంటీ

ఇటీవలి రోజులలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు టీడీపీ , జనసేన పార్టీల మధ్య సంబంధాలపై చర్చనీయాంసంగా మారాయి. ముఖ్యంగా అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య స్వల్ప ఉద్రిక్తతకు దారి తీశాయి. ఈ సంఘటనలతో క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, సోషల్ మీడియాలో దూషణలకు దిగడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు పైస్థాయిలో అంతగా ప్రభావం చూపలేదని చెప్పాలి.అయితే అగ్రనేతల స్థాయిలో మాత్రం సమన్వయం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం బాగాలేదని తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి దాదాపు నలభై నిమిషాలు సమావేశం కావడం, చర్చలు జరపడం రెండు పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని చూపించింది. దీంతో తాత్కాలికంగా ఉన్న ఉద్రిక్తతలు చల్లారినట్లు కనిపించాయి. పై స్థాయిలో ఇద్దరు నాయకులు పరస్పర గౌరవం, అవగాహనతో ముందుకు సాగుతున్నారు.విజయవాడ లో జరిగిన "ఆటో డ్రైవర్ల సేవలో" అనే కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇద్దరూ పాల్గొని ఒకే వేదికపై కనిపించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించడం, ఆయన సారథ్యంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పడం కూడా రెండు పార్టీల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరిచింది. దీని ద్వారా అగ్ర నాయకుల మధ్య పెద్ద విభేదాలు లేవని స్పష్టమవుతోంది.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు, దానికి వ్యతిరేకంగా స్పందించిన జనసేన నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. చిరంజీవి పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తప్పు అంటున్న జనసేన నాయకులు ఎక్కువగా ఉన్నారు. ఈ కారణంగా కొన్ని నియోజకవర్గాల్లో రెండు పార్టీల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే నష్టం క్షేత్రస్థాయి నాయకులకే జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇక రాబోయే ఎన్నికల దృష్ట్యా రెండు పార్టీలూ తమ బలం పెంపుపై దృష్టి సారిస్తున్నాయి. జనసేన పార్టీ నూతన నాయకులను ముందుకు తెచ్చే ప్రయత్నంలో ఉండగా, టీడీపీ మాత్రం ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని చూస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ అంతర్గత విభేదాలు కొంతమంది స్థానిక నాయకులకు ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉంది. అగ్ర నాయకులు పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్న సమయంలో, క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే పార్టీ బలహీనపడడమే కాకుండా, వారి రాజకీయ భవిష్యత్తుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

## అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా...

- మొదటి పేజి తరువాయి

కోసం నిపుణుల సలహా మేరకు మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి సవిత ముఖ్యమంత్రికి తెలియజేశారు. పెదనందిపాడు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారిలో ఇద్దరు మినహా మిగిలిన వారందరినీ డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాతే వారిని డిశ్చార్జ్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. అన్నపర్రు గ్రామంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సవిత ఈ సందర్భంగా వివరించారు.

కలుషిత ఆహారం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిర్ధారణ కోసం నీరు, ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, ఆ నివేదికలు వచ్చిన వెంటనే వాటి ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో ఉన్న చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని మంత్రి, అధికారులను ఆదేశించారు.

## మంత్రి పొంగులేటిపై ఖర్గేకు ఫిర్యాదు చేసిన కొండా మురళి

- మొదటి పేజి తరువాయి

మేడారం పనులను ఇప్పించుకుం టున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు కూడా కొండా మురళి ఫిర్యాదు చేశారు.

ఈ విషయంలో అధిష్ఠానం నుంచి తమకు సానుకూల స్పందన వచ్చిందని కొండా మురళి తెలిపారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వచ్చే ఏడాది మేడారం జాతరను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే మేడారం టెండర్ల వ్యవహారంలో పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని కొండా మురళి భార్య, మంత్రి కొండా సురేఖ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

## దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం... ఐదు జిల్లాలకు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం (అక్టోబర్ 12) రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని స్పష్టం చేసింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, రేపు అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడవచ్చని అధికారులు అంచనా వేశారు.వర్షాల సమయంలో ఉరుములు, మెరుపులు ఆకస్మికంగా సంభవించే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని హెచ్చరించారు.ఇప్పటికే ఈ ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షపాతం నమోదైందని సంస్థ వివరించింది. గడిచిన 24 గంటల్లో చిత్తూరులో 34.2 మిల్లీమీటర్లు, తూర్పు గోదావరి జిల్లా లక్ష్మీపురంలో 31 మిల్లీమీటర్లు, శ్రీకాకుళం జిల్లా కోర్లాంలో 26.7 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయినట్లు తెలిపింది.

## పొత్తుకు నో అన్నారని... బీహార్‌లో భారీ ప్లాన్‌తో బరిలోకి ఒవైసీ ఎంఐఎం పార్టీ!

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. 'ఇండియా' కూటమి నుంచి పొత్తు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, ఒంటరిగా తమ బలాన్ని నిరూపించుకోవాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ పరిణామం బీహార్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదు రెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నామని ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ (ఇండియా కూటమి) కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిగా ఎదగడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "మా ఉనికిని ఇటు ఎన్డీఏ, అటు మహాఘట్‌బంధన్ గుర్తించేలా చేస్తాం. మా బలాన్ని తక్కువ అంచనా వేయలేరు" అని ఆయన అన్నారు.పొత్తు కోసం ఆర్జేడీ అధినేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌లకు తాను లేఖ రాసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని అఖ్తరుల్ ఇమాన్ తెలిపారు. "వారి నుంచి స్పందన లేనప్పుడు, మా పార్టీ బలాన్ని విస్తరించుకోవడానికి మేము అన్ని విధాలా ప్రయత్నించాలి. ఇప్పటికే కొన్ని భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయమై చర్చిస్తున్నాం. మరికొన్ని రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది" అని ఆయన వివరించారు.2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఐదు స్థానాల్లో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరడంతో ప్రస్తుతం అఖ్తరుల్ ఇమాన్ మాత్రమే పార్టీ ఏకైక శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. బీహార్‌లో 17 శాతానికి పైగా ఉన్న ముస్లిం జనాభానే లక్ష్యంగా చేసుకుని ఎంఐఎం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇటీవల పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా సీమాంచల్ ప్రాంతంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎంఐఎం పోటీతో సెక్యులర్ ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తుండగా, తమ పార్టీ ఏ కూటమికి 'బీ-టీమ్' కాదని ఎంఐఎం నేతలు స్పష్టం చేస్తున్నారు.

## నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నాడు విశాఖ నగరంలో పర్యటించి, రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం విశాఖ భవిష్యత్ ప్రగతికి నాంది పలకనుందని భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్ గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్... ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12వ తేదీన విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జుూ%) కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాక వల్ల భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతో పాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా నారా లోకేశ్... నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్(%ాఱటఎ ×అటఱఅఱ్ రాజుఖఎవం ాఱఎ్‌వఎ%) నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను సిఫీ అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జుూ%) సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది. భారతదేశంతో

ంపాటు ఆగ్నేయాసియాలోని సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, థాయ్ లాండ్ వంటి దేశాల మధ్య త్వరితగతిన డేటా ప్రాసెసింగ్ చేస్తూ విశాఖ సీఎల్ఎస్ వ్యూహాత్మక ల్యాండింగ్ పాయింట్ గా పనిచేస్తుంది.

## భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే అలా కూడా చేయండి

భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు.భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి

పుస్తకాలు చదవడం ద్వారానే మానసిక పరిపక్వత సాధ్యమవుతుందని, తన జీవితంపై పుస్తకాల ప్రభావం ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని, తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' అనే పుస్తకాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటాం. ఏదైనా సాధించాలంటే పట్టుదల చాలా అవసరం. ఈ పుస్తకంలోని మాలతి పాత్ర నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. ఆ పాత్రలో ధైర్యసాహసాలు, మేధస్సు, స్వాతంత్ర్య కాలం నాటి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కనిపిస్తాయి" అని వివరించారు. తన తల్లి వంట గది నుంచే ప్రపంచాన్ని చూశారని గుర్తుచేసుకున్నారు.

భారతీయ ఆలోచనా విధానం నుంచే తాను వచ్చానని, మన దేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం ఉందని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి 'ఝాన్సీ వీర మహిళ' అని పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. ఇదే వేదికపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను త్వరలోనే అమలు చేయబోతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ నా అభిమాన నాయకుడు. నేను ఈ రోజు మంత్రిగా కాకుండా సాధారణ వ్యక్తిగా వచ్చి ఉంటే, మీ అందరితో కలిసి కింద కూర్చుని 'పవర్ స్టార్', 'ఓజీ' అని గట్టిగా అరిచేవాడిని" అని తన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## అవన్నీ వట్టి పుకార్లే

- మొదటి పేజి తరువాయి

అవన్నీ నిరాధారమైన వదంతులేనని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని ఆయన శనివారం స్పష్టం చేశారు. బెంగళూరులోని లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్‌లో జరిగిన 'బెంగళూరు వాక్' కార్యక్రమంలో ప్రజలతో ముచ్చటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ప్రస్తుతం కేబినెట్ విస్తరణ జరగడం లేదు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురిస్తున్నాయి. ఇలాంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే ముఖ్యమంత్రి గానీ, నేను గానీ సూచించాలి. మేమిద్దరం అలాంటిదేమీ చెప్పనప్పుడు, అదంతా తప్పుడు ప్రచారమే అవుతుంది. ఏదైనా ఉంటే అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుంది" అని శివకుమార్ స్పష్టం చేశారు.

**ఒకవైపు ఖండన.. మరోవైపు సీఎం విందు**

డీకే శివకుమార్ మంత్రివర్గ విస్తరణ వార్తలను ఖండిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్టోబర్ 13న కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా విందు సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. బీహార్ ఎన్నికల తర్వాత కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సీఎం సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు, వాల్మీకి జయంతి వేడుకల్లో మాట్లాడిన సిద్ధరామయ్య, తదుపరి పునర్వ్యవస్థీకరణలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నేతకు తప్పకుండా మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే, రాబోయే మున్సిపల్, జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలపై చర్చించేందుకే సీఎం విందు సమావేశం ఏర్పాటు చేశారని శివకుమార్ అంటున్నారు.

## బొత్స ఈ మధ్య బాగా ఫోకస్ అవుతున్నారు... ఆయనకు జగన్ నుంచే ప్రాణహాని ఉంది

- మొదటి పేజి తరువాయి

ఆయనకు ప్రభుత్వపరంగా పూర్తి భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పల్లా ప్రకటించారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బొత్స మాటలను బట్టి చూస్తే, ఆయనకు వైసీపీ నుంచే ముప్పు పొంచి ఉందని స్పష్టమవుతోందని పల్లా అన్నారు."జగన్‌ను మించి వెళ్లినా, పార్టీలో ఆయనకన్నా ఎక్కువ పేరు సంపాదించుకున్నా వారిని అంతం చేయడమే ఆయన నైజం" అని పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. వైఎస్ వివేకానంద రెడ్డిని కూడా ఇదే కారణంగా హత్య చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా, మండలిలో బొత్స పనితీరు బాగా ఫోకస్ అవుతోందని, ఇది చూసి ఓర్వలేకే జగన్ ఆయనపై కక్ష పెంచుకున్నారని అనిపిస్తోందని పల్లా అభిప్రాయపడ్డారు. "బొత్స సత్యనారాయణ అంటే మాకు గౌరవం ఉంది. ఆయన భయపడాల్సిన అవసరం లేదు. మేం ఆయనకు అండగా నిలుస్తాం" అని పల్లా హామీ ఇచ్చారు.

**కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో టీసీఎస్, మహేంద్ర, లూలూ, రిలయన్స్, ఎన్టీపీసీ గ్రీన్ టెక్ హైడ్రోజన్, వంటి అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయంటే సీఎం చంద్రబాబు వల్లే అన్నారు. "విశాఖకు ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ రాబోతోంది. విశాఖలో సిఫి ఏఐకి సంబంధించి ఒక డేటా సెంటర్ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ప్రారభించబోతున్నారు. ఢిల్లీలో గూగుల్ కు చెందిన రైడెన్ తో రూ.87,500 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకోబోతున్నాం. ప్రసిద్ధి చెందిన డేటా సెంటర్ గా వర్జీనియా ఉంది. రేపు వరల్డ్ డేటా సెంటర్ గా విశాఖ మారబోతోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా చేయాలన్న లక్ష్యంతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేశారు. చంద్రబాబుపై నమ్మకంతో అనేక పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి. విశాఖను డేటా హబ్ గా, డేటా వ్యాలీగా ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్లబోతున్నాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్ సాకారంతో నేడు విశాఖ ఐటీ సిటీగా రూపాంతరం చెందబోతోంది. విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే... జగన్ అడుగడుగునా భవిష్యత్ భయంతో అడ్డుపడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకుంటున్నారు. రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు రాకుండా చూడాలని కుట్రలు చేస్తున్నారు. పెట్టుబడి దారులకు భయాందోళనలు కలిగించేలా జగన్ అల్లర్లు చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టకండని అనేక ఆర్థిక సంస్థలకు వైసీపీ వాళ్లు లేఖలు రాసి రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు" అంటూ పల్లా ధ్వజమెత్తారు.

## చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా అసాధారణంగా పెరుగుతోంది

- మొదటి పేజి తరువాయి

బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు, సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని తెలిపారు. ఇవన్నీ గతంలో జరిగిన చొరబాట్లకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా తీవ్రంగా ఆరోపించారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు కూడా సరిహద్దులు ఉన్నాయి. మరి అక్కడ నుంచి చొరబాట్లు ఎందుకు జరగడం లేదు?" అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం లేదా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) బాధ్యత మాత్రమే కాదని ఆయన స్పష్టం చేశారు.భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని అమిత్ షా వివరించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే ఝూర?ండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# కొలమాసనపల్లె నందు పల్లె నిద్ర కార్యక్రమంలో సీఐ.మురళీ మోహన్



**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 11**


పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కొలమాసనపల్లి గ్రామాన్ని పలమనేరు సీఐ.మురళీ మోహన్ సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమై, సమావేశం నిర్వహించి, అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా సైబర్ నేరాలు,రోడ్డు భద్రత, మహిళలపై నేరాలు, ఫోక్సో చట్టం, బాల్యవివాహాలు,ఎన్. డి.పి.ఎస్.చట్టం వంటి అంశాలపై చక్కటి ఉదాహరణలతో ప్రజలకు అవగాహన కల్పించారు.రాత్రి గ్రామంలోనే గస్తీ నిర్వహించి పల్లె నిద్ర చేశారు.ఇందులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్ పవర్
నెల్లూరు | తిరుపతి | చిత్తూరు


# గరుడ వారధి పై

## "సేఫ్టీ రైలింగ్,స్పీడ్ లిమిట్ గన్స్" ఏర్పాటు చేయండి

## బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి






**తిరుపతి/పెన్ పవర్/అక్టోబర్ 11**

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థంతో పాటు తిరుపతి నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం టిటిడి,స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ నిధులతో నిర్మించిన "గరుడ వారధి" ఫ్లైఓవర్ పై జరుగుతున్న ప్రమాదాల కారణంగా సంవత్సర కాలంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారని నిన్న లక్ష్మీపురం సర్కిల్ వద్ద బుల్లెట్ ద్విచక్ర వాహనం గోడను ఢీ కొట్టి ఇద్దరు యువకులు ఫ్లైఓవర్ పైనుంచి కింద పడి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు! టిటిడి నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ సంయుక్తంగా యుద్ధ ప్రాతిపదికన గరుడ ఫ్లైఓవర్ కు ఇరువైపులా వెంటనే "సేఫ్టీ రైలింగ్" (సేఫ్టీ గార్డ్) తో పాటు "స్పీడ్ లిమిట్ కెమెరా గన్స్" ఏర్పాటు చేయాలని ప్రమాదాలను నివారించాలని నవీన్ విజ్ఞప్తి చేశారు గరుడ వారధి పై "స్పీడ్ లిమిట్ కెమెరా గన్స్" కారణంగా అతి వేగంగా వెళ్లే వాహనాలను "క్యాప్చర్" చేసి జరిమానా విధించేలా కఠిన చర్యలు చేపట్టాలన్నారు హైదరాబాద్ లోని పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ పై వరుస ప్రమాదాలు జరగడంతో "సేఫ్టీ రైలింగ్" "స్పీడ్ లిమిట్ క్యాప్చర్ గన్స్" ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించారని దానికి సంబంధించిన ఫోటోలను నవీన్ టీటీడీ,జిల్లా ఎస్పీ నగరపాలక సంస్థ అధికారులకు పంపించడం జరిగిందన్నారు! గరుడ వారిది ఫ్లైఓవర్ పై వెళ్లే అన్ని వాహనాలు తూచా తప్పకుండా స్పీడు నియంత్రణ పాటించి ప్రమాదాలు,ప్రాణనష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు తగ్గట్టుగా మరిన్ని సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయాలన్నారు.

# దప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించండి




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11 :**

దప్పు కళాకారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ దప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ప్రాచీన కళ అయిన దప్పు పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వెంకటయ్య వాపోయారు. వయోపరిమితి తగ్గింపు, పెన్షన్లు, యూనీఫామ్, గుర్తింపు కార్డులు, దప్పు పరికరాల మంజూరులో ఏళ్ల తరబడి మీనమేషాలు లెక్కిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వంలో కదలిక రాకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, సహాయ కార్యదర్శి అరుణాచలం, రఘు, సురేష్, అక్బర్ బాషా, వెంకటముని, గురవయ్య, గోవిందస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యువజన అధ్యక్షులను సన్మానించిన మాజీ బోర్డు సభ్యులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ , అక్టోబర్ 11 :**

శ్రీకాళహస్తి వైఎస్ఆర్సిపి పట్టణ విభాగ యువజన అధ్యక్షులైన మల్లెంబాకం మునికృష్ణారెడ్డిని శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు ప్రకాశం పంతులు తన అనుచరులతో శనివారం దుస్సాల్వా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లెంబాకం మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ యువత అంతా కలిసికట్టుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించాలని, మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్న గెలుపులో మనమందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాకు ఈ అవకాశం కల్పించిన శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్న మరియు మా గురువర్యులైన మాజీ ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు నన్ను ఇంతగా ఆదరిస్తున్న పార్టీలకు అతీతంగా ఫోన్ ల ద్వారా శుభాకాంక్షలు తెలియజేసి, వారి అమూల్యమైన సలహాలను అందిస్తూ ప్రేమానురాగాలు చూపిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ వెంకటరమణ మురళి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి యోగ పోటిలల్లో రజక పథకం సాధించిన మాస్టర్ అయిలం సుజాత






**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , అక్టోబర్ 11 :**

సెప్టెంబర్ 28 అక్టోబర్ 1 వ తేదీ వారికీ విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి యోగసన భారత్ వారు నిర్వహించు సీనియర్ – సి మరియు జూనియర్ జాతీయ యోగసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్– 2025 పోటీలు నిర్వహించారు. దీనిలో ట్విస్టింగ్ బాడీ మహిళ విభాగంలో మొదటి బహుమతి బంగారు పతకం నెల్లూరు చెందిన మాస్టర్ ప్రసన్న, రెండో బహుమతి రజక పథకం శ్రీకాళహస్తి చెందిన మాస్టర్ ఆయిలం సుజాతకు దక్కింది. యోగ మాస్టర్ అయిలం సుజాత మాట్లాడుతూ.... యోగ వల్ల మన ఆరోగ్యం ఉల్లాసంగా,ఉలాత్సాహంగా ఉంటుంది. అలాగే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.కావున ప్రతి ఒక్క యోగాను అభ్యసించాలని కోరారు. అలాగే మాస్టర్ కు విద్యార్థులు మరియు పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# రుయా ఆసుపత్రిలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి సిఐటియు డిమాండ్.

## నేటి నుండి రిలే నిరసన దీక్షలు ప్రారంభించిన కార్మికులు.




**తిరుపతి/పెన్ పవర్/అక్టోబర్ 11**

రుయా ఆసుపత్రిలో దాదాపు 20 ఏళ్ల పైబడి నుండి పనిచేస్తున్నటువంటి కార్మికులను కొత్తగా కాంట్రాక్ట్ తీసుకున్నటువంటి పద్మావతి కంపెనీ కాంట్రాక్టర్ భాస్కర్ నాయుడు టెండర్ తీసుకుని కేవలం వారం రోజులు మాత్రమే అయినది. ఎన్నో ఏళ్ల నుండి పని చేస్తున్నటువంటి కార్మికులను హఠాత్తుగా మీకు 50 సంవత్సరాలు పైబడింది మీరు రేపటి నుంచి పనిలోకి రాకూడదని కార్మికులను అర్ధాంతరంగా పనిలో నుంచి నిలిపివేశాడు. దీనికి నిరసనగా కార్మికులు రుయా ఆసుపత్రి ప్రాంగణంలో నేడు శనివారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రుయా ఆసుపత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కే వేణుగోపాల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి సుబ్రమణ్యం, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు పి బుజ్జి, ఎం మాధవ్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుయా ఆసుపత్రి రాయలసీమ జిల్లాలోనే తల మాణికంగా ఉన్న అతిపెద్ద ఆసుపత్రి 1260 బెడ్ల సామర్థ్యం గల ఆసుపత్రి 1260 బెడ్లకు దాదాపు 600 మంది పైచిలుకు కార్మికులు అవసరం ఉంటే కేవలం రెండు మూడు వందల మంది కూడా పనిచేసే పరిస్థితులు ఈ ఆస్పత్రిలో లేదు. సమస్యల వలయంలో రుయా ఆసుపత్రి ఉన్నది.సమస్యలు పరిష్కరించాల్సింది పోయి మరికొన్ని సమస్యలు పెంచే విధంగా అక్కడ పరిస్థితులు పరిణామాలు జరుగుతున్నాయని అన్నారు. గత 20 ఏళ్ల నుండి పనిచేస్తున్నటువంటి కార్మికులను అనుభవం కలిగి ఉన్న కార్మికులను పనులు చేయకపోతే పనులలో ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకోమని చెప్పాలి పనిచేయడం లేదంటే తొలగించాలి తప్ప బాగా పనిచేస్తున్నటువంటి కార్మికులను కరోనా సమయంలో ఒక్కొక్క కార్మికుడు కార్మికురాలు 10 వార్డులు 12 వార్డులు శ్రమించి పనిచేసిన అనుభవం కలిగినటువంటి కార్మికులను అర్ధాంతరంగా తొలగించడం చట్ట విరుద్ధం అన్యాయం అని తెలిపారు. కాంట్రాక్టర్ ఏది అనుకుంటే అది చట్టం కాదని కాంట్రాక్టర్ రాసుకున్న ఎం ఓ యు కార్మిక చట్టం కాదని కార్మిక చట్టం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుడు 60 సంవత్సరాల వరకు పనిచేయచ్చుని ఈ విషయాన్ని కాంట్రాక్టర్ తెలుసుకోవాలి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలు ఉంటే ఈ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికుల వయసు 50 సంవత్సరాలు దాటితే పని చేయకూడదని ఏ చట్టంలో ఉందని, ఆ రకంగా ఏ ప్రభుత్వము తీర్మానం చేయలేదని ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న భాస్కర్ నాయుడు తీరు సరైన విధానం కాదని తన వైఖరి మార్చుకొని తొలగించిన 50 మంది కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకొని యధాతధంగా పనుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి ప్రభాకర్ తొలగించిన కార్మికులు లక్ష్మమ్మ, బి రాణి, వై లక్ష్మమ్మ, ఎస్ బిబి, పి సుబ్రహ్మణ్యం, పి రామ్మూర్తి, కే సుబ్రహ్మణ్యం, పి లక్ష్మీదేవి, కే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమీషనర్ ను అభినందించిన ఎమ్మెల్యే అమరనాధరెడ్డి

**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 11**

పలమనేరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛత అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణ రెడ్డితో పాటు సిబ్బందిని నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా ప్రజలు అధికారుల పరస్పర భాగస్వామ్యంతోనే ఈ అవార్డు దక్కిందని దీంతో మనందరిపై మరింత బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో జాతీయస్థాయిలో అవార్డును దక్కించుకునేలా అందరూ కలిసికట్టుగా పనిచేసి పారిశుధ్యంలో పలమనేరుకు మంచి పేరును తీసుకొద్దామని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలో సమస్యలు ఏదైనా ఉన్న వాటి పరిష్కారానికి కృషి చేస్తానని,ప్రజలు కూడా మున్సిపల్ సిబ్బందికి చెత్త సేకరణ విషయంలో సహకరించి తోడ్పాటు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారుల తో పాటు సిబ్బంది కూడా ఉన్నారు.



## ప్రపంచ అందుత్వ దినోత్సవ

# కంటి అవగాహన ర్యాలీ




**వెంకటాచలం, (పెన్ పవర్) అక్టోబర్ 11**

వెంకటాచలం మండల కేంద్రంలో శనివారం ప్రపంచ అందుత్వ దినోత్సవ సందర్భంగా కంటి అవగాహన ర్యాలీ వెంకటాచలం స్వర్ణ భారత్ ట్రస్ట్ లోని ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో శ్రీమతి ముప్పవరపు ఉషమ్మ ప్రారంభించారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ స్కూల్ పిల్లలతో అవగాహన ర్యాలీ జరిగింది. కంటి సమస్యల పట్ల వివరించారు. అందత్యం దేనివల్ల వస్తుంది, ఎలా జాగ్రత్తలు పాటించాలి కార్యక్రమంలో వివరించారు. ఈ ర్యాలీలో డాక్టర్ మౌనిక, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి సులోచన, వాసు బాబు, వెంకట్రావు, అను బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అత్తికాయల సుబ్రహ్మణ్యం దంపతులు





**నాయుడుపేట, పెన్ పవర్, అక్టోబర్ 10**

నాయుడుపేట మండలంలోని విన్నమాల గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 4 వ తిరువళ్ల శనివారం సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం,రాజేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కె. విజయ్ కుమార్ స్వామివారికి పూజలు చేసి అత్తికాయల సుబ్రహ్మణ్యం దంపతులను ఆశీర్వదించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తికాయల ధనుంజయ,సుకన్య, షాజహాన్, బాలకృష్ణ, పుల్లయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 11**

పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఇరిగేషన్ శాఖా అధికారులతో నిర్వహించిన సమీక్షలో శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల ధాటికి చెరువు కట్టల సామర్థ్యంపై ఆరా తీశారు. మున్సిపల్ పరిధిలోని నీళ్ళకుంట పాఠశాల ఆవరణలో చేరిన నీటిని వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా అత్యవసరంగా చేపట్టాలసిన చెరువు పనులపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ డిఈ. చౌక్లా నాయక్,ఏఈ. లక్ష్మినారాయణ,గంగవరం ఏఈ. దేదీప్య తదితరులున్నారు.

# అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం...



**సీతారాంపురం పెన్ పవర్డఅక్టోబర్ 11**


మండలంలోని పంద్రంగి గ్రామ స్వామి చెరువు సమీపానగల అటవీ ప్రాంతంలోని పొదల్లో శనివారం ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, తలపై పెద్ద రాళ్లు పడి ఉండడం, మృతదేహం కుళ్ళి ఆడ, మగ అనే విషయం పై స్పష్టత లేకపోవడంతో హత్య జరిగి ఉంటుందన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఉదయగిరి సీఐ వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాలికను కిడ్నాప్ చేసిని నిందితునిపై పొక్సో కేసు నమోదు


**పలమనేరు,పెన్ పవర్,అక్టోబరు 11,**

అక్టోబరు 7వ తేదిన గంటాఊరుకి చెందిన శ్యామలాదేవి అనే మహిళ తన 16 సంవత్సరాల కూతురు తప్పిపోయినట్లు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తులో భాగంగా ఆమెను నిన్న ట్రేస్ చేసి విచారించగా పంజాని సత్రంకు చెందిన షారుఖ్ తనను బలవంతంగా తీసుకొని వెళ్లి శారీరకంగా అనుభవించాడని బాలిక చెప్పిందని విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. దీంతో పొక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి,కేసుకు సంబంధించిన ముద్దాయి షారుక్ ను పట్టణ పరిధిలోని నాగమంగళం ఫ్లైఓవర్ దగ్గర శనివారం సుమారు నాలుగు గంటలకు పలమనేరు సిఐ. మురళీమోహన్ అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

# తిరుపతి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా నియామకం.. వై వి రమణయ్య






ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ
(ముదిరాజ్, ముత్తరాసి, తెనుగోళ్ళు)
రి. నెం.: ఓల్డ్ : 24/1954, న్యూ : 41/2017.
ఆఫీస్ : చిగురుకోట గ్రామం, ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ జాతీయ అధ్యక్షులు Ex. M.L.C.
కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ
సెల్ : 8297704499
తేది : 10/10/2025
నియామక పత్రం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ శ్రీ వై. వెంకట రమణయ్య గారిని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షులుగా నియమించిందని తెలుపుటకు సంతోషిస్తున్నాను. జాతికి విశిష్ట సేవలు అందించగలరనే నమ్మకంతో ఈ నియామకం జరిగింది.
అన్ని వర్గాలను సమీకరిస్తూ, రాజకీయాలకు అతీతంగా, నియమనిబంధనలు పాటిస్తూ, జాతి సమగ్రతకు, సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు మీ వంతు సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను.
కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ

**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 11 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షులుగా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన బాలాజీ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ వై.వెంకట రమణయ్య ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా గంగపట్నం చాముండేశ్వరి ఆలయ ఆవరణలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కోర్నా వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులుగా వై వి రమణయ్య నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వై వెంకట రమణయ్య ముదిరాజ్ మాట్లాడుతూ.. తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులకు మరియు రాష్ట్ర అధ్యక్షులకు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే అన్ని వర్గాలను సమీకరిస్తూ, రాజకీయాలకు అతీతంగా, నియమ నిబంధనలు పాటిస్తూ, జాతి సమగ్రతకు, సర్వతోముఖాభివృద్ధికి, అహర్నిశలు తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని తెలిపారు. వెంకట రమణయ్య తిరుపతి జిల్లా అధ్యక్షులుగా నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ పెద్దలు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సదాశివకోనలో ఎర్రచందనం దుంగలు స్వాధీనం



**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , అక్టోబర్ 11 :**

శ్రీకాళహస్తి ఏర్పేడు మండలం సదాశివ పాలకోన ప్రాంతంలో అటవీశాఖ అధికారులు భారీ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు మొత్తం 435 కిలోల బరువున్న 51 ఎర్రచందనం దుంగలు వీటి విలువ రూ.11 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. శ్రీకాళహస్తి అటవీశాఖాధికారి లోకేష్ మాట్లాడుతూ సదాశివపాలకోన ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారని గోప్య సమాచారం అందడంతో తిరుపతి అటవీశాఖ, ట్రాన్స్పోర్ట్ సిబ్బంది తో కలిసి దాడి చేశాము. మమ్మల్ని గమనించిన స్మగ్లర్లు అడవిలోకి పారిపోయారని, అక్కడ వదిలిపెట్టిన 51 దుంగలను స్వాధీనం చేసుకున్నాము. అదేవిధంగా మరికొన్ని చెట్లు నరికివేయబడినట్లు గుర్తించాం. వాటిని కూడా స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటున్నాం అని వివరించారు. అదనంగా, శ్రీకాళహస్తి పరిసర అడవుల్లో ఎర్రచందనం సంపద అధికంగా ఉందని, వాటిని సంరక్షించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అడవుల్లో బెస్ క్యాంపులు ఏర్పాటు చేసి నిఘా పెంచుతున్నాం తమిళనాడు నుంచి స్మగ్లర్లు రావడము వారికి స్థానికంగా కొందరు సమాచారం అందిస్తున్నట్లు తేలింది వారి వివరాలు సేకరిస్తున్నాము వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించాం అని తెలిపారు.

# సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడి హేయమైనది

## మంద వెంకటేశ్వరరావు మాదిగ





**బోగోలు పెన్ పవర్ సెప్టెంబర్ 11**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేడు శనివారం బోగోలు మండలం చెంచులక్ష్మీ పురంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నెల్లూరు జిల్లా ఇన్చార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఈ దేశ అత్యున్నత న్యాయాధిపతి పై బీఆర్ గవాయ్ పై దాడి చేయడం అంటే ఈ దేశంలో దళిత గిరిజనులుల పరిస్థితి ఎలా ఉందో ఈ ఘటనే దానికి నిదర్శనం అని ఇలాంటి ఘటనలు మరోసారి పునరావతం కాకుండా ఉండాలంటే యావత్ సమాజం రోడ్డు మీదకు రావాలని కోరారు దాడికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు అధేవిధంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగలు మాట్లాడుతూ ఈనెల 13 న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే భారీ నిరసన కార్యక్రమంతో మన సత్తా చాటాలని అందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నలుమూలల నుండి వందలాది మంది తరలిరావాలని అందుకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు సన్నద్ధం చేయాలని వారు పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్రనాయకులు ఏగూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఏసుపోగు జయరాజ్ మాదిగ,ఎంఎఈఎఫ్ నాయకులు గోసాల కొండలరావు మాదిగ, అక్కిలగుంట ఏసు మాదిగ,అంద్ర బుడ్డయ్య మాదిగ,చింతకుంట అంకయ్య మాదిగ,కొమరిక రమణయ్య మాదిగ,చేవూరి కిరణ్ మాదిగ,గోసాల సుధాకర్ మాదిగ,బంకా పిలుఫ్ మాదిగ,వన్నం క్రిష్ణయ్య మాదిగ,డి శ్రీనివాస్ మాదిగ, గోచిపాతల ఆనంద్ రావు మాదిగ,కావలి శ్రీనివాస్ మాదిగ,చేవూరి వరప్రసాద్,ఏసుపోగు నవీన్ మాదిగ,కర్రా మల్లికార్జున, డి వాసు మాదిగ,ఎన్ గంగాధర్ మాదిగ,జనార్ధన్ మాదిగ,జి నాగరాజు వెంగళరావు మాదిగలు నాయకులు కార్యకర్తలు తదితరులు పోల్గొన్నారు.

## మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

# జన్మదినోత్సవ వేడుకలు





**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 11**

రాష్ట్ర మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు పలమనేరు పట్టణంలో మరియు గంగవరం మండల కేంద్రము నందు అత్యంత ఘనంగా జరిగాయి. పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటేగౌడ ఆదేశాల మేరకు పలమనేరు టవర్ క్లాక్ వద్ద టౌన్ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఇందులో ఆయనతో బాటు నాయకులు చెంగారెడ్డి,నాగరాజు,నరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గంగవరం పార్టీ కార్యాలయం నందు మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఇందులో నాయకులు చంద్రప్ప, ప్రహ్లాద,గిరిరాజా రెడ్డి,ఎంపీపీ వెంకట రమణ,శ్రీరాములు రెడ్డి,మంజునాథ్ రెడ్డి,రెడ్డిప్రసాద్,రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురప్పల్లి వంతెనకు మరమ్మతులు చేపట్టండి

## ఎమ్మెల్యేకు పంచాయతీవాసుల వినతి



**పలమనేరు,పెన్ పవర్, అక్టోబరు 11**

పలమనేరు మండలం మొరం పంచాయతీ పరిధిలోని కురప్పల్లి వంతెన ప్రస్తుత వర్షాలకు దెబ్బతిని ప్రమాద కరంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వెంటనే మరమ్మతు పనులు చేయించాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డికి పంచాయతీ వాసులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు వెంకటముని రెడ్డి, చంద్రశేఖర్,విశ్వ నాథ రెడ్డి,పూర్ణచంద్ర, అమరనాథ,కవీంద్ర నాయుడు,జగదీష్, జయప్ప, వెంకటరమణ తదితరులున్నారు.

# ఎమ్మెల్యేను కలసిన నూతన ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్



**పలమనేరు,పెన్ పవర్,అక్టోబరు 11**

నియోజకవర్గ శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని పలమనేరు నూతన ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్ భాషా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు 2 డిపో నుంచి పలమనేరుకు బదిలీపై వచ్చిన ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా డిపోకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేపు శ్రీకాళహస్తిలో జాబ్ మేళా


**శ్రీకాళహస్తి , పెన్ పవర్, అక్టోబర్ 11 :**

శ్రీకాళహస్తిలోని ఆఫీసులో ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. ఈ మెగా జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి పాస్, ఫెయిల్ అయినా నిరుద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 11**

పట్టణంలోని విక్కిరాలపేట రోడ్ లో శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ నందు బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల అధినేత ఉన్నం భాస్కరరావు, సునీత దంపతుల కుమార్తె మాధురి, పూర్ణేశ్వరరావు వివాహ నిశ్చితార్థ కార్యక్రమం శనివారం జరగగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరై కాబోయే నూతన వధూవరును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు నార్నే రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, దివి శ్రీనివాసులు నాయుడు, వడ్లమూడి సురేష్, గుర్రం మాల్యాద్రి, నల్లూరి సుబ్బారావు, బత్తిన మాల్యాద్రి ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

## అర్ధవీడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్ ఐ, కూటమి పార్టీల నేతలు.






**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 11**

పాత రేషన్ కార్డుల స్థానంలో వినియోగదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమాలు శనివారం అర్ధవీడు మండలంలోని అన్ని చౌక ధరల దుకాణాలలో ప్రారంభమయ్యాయి. రేషన్ వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆశయంతోపాటు రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నది. అందులో భాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ స్మార్ట్ కార్డులను ముద్రించి అర్ధవీడు మండలానికి అవసరమైన స్మార్ట్ రేషన్ కార్డులను ఇటీవల సరఫరా చేసింది . ఈ సందర్భంగా అర్ధవీడులో డీలర్ మాబు రేషన్ షాపు వద్ద కూటమి నాయకులు కొత్త స్మార్ట్ కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పాలుగుల్ల పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి వాటిని సద్వినియోగం చేసు కోవాలని , తద్వారా ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. బిజెపి నాయకులు రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల వలన రేషన్ సులభతరంగా తీసుకునేందుకు అవకాశం ఉండటంతో , పాటు రేషన్ షాపులలో అక్రమాలను నివారించేందుకు స్మార్ట్ కార్డులు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఆర్ ఐ సుబ్బారావు, తెలుగుదేశం నాయకులు కాశీరావు , శ్రీనివాసరావు , డీలర్లు వలీ , మాబు, చంద్ర శేఖర్ , ప్రసంగి , సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు పలువురు కూటమి పార్టీలనేతలు పాల్గొన్నారు.

## దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాధాకృష్ణ గాంధీకి మాధవప్రసాద్ శుభాకాంక్షలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి చైర్మన్ బొర్ర రాధాకృష్ణ గాంధీ ప్రమాణ స్వీకారం సందర్భంగా శనివారం శ్రీ నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ గాంధీ దంపతులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం శ్రీ నారాయణస్వామి చిత్రపటాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.



# భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -మాలకొండ పై రూ.25 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం





**వలేటివారిపాలెం పెన్ పవర్, అక్టోబర్ 11**

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తులందరికీ సకల సౌకర్యాలు, మెరుగైన వసతులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని సందర్శించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా మొత్తం రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు.రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గాల్వన్ షెడ్‌ను, రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన రేకుల షెడ్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ షెడ్ల నిర్మాణం వలన మాలకొండకు విచ్చేసే భక్తులకు సౌకర్యవంతమైన ఆశ్రయం లభించనుంది. అనంతరం, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ని మేళ తాళాలతో ఆలయ వేదపండితులు మంత్రోచ్చారణతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. దర్శనం అనంతరం, ఆయన ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రాన్ని సందర్శించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహణ, భక్తులకు అందుతున్న భోజన వసతి ఏర్పాట్లపై అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భక్తులతో మాట్లాడి అన్నదాన నిర్వహణ, భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.. మాలకొండ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రశేఖర్, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, సోమినేని రవీంద్ర, గుర్రం మాల్యాద్రి, కాకుమాని హర్ష ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల నుండి పార్టీని బలోపేతం చేద్దాం

## కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ, తొలి సంతకంచేసినఎమ్మెల్యే తాటిపర్తి

## రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ అక్టోబర్ 11**

నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్నా దమన నీతిని ఎత్తి చూపిస్తూ, జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రతి గ్రామంలో వైస్సార్సీపీ ని బలోపేతం చేద్దామని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు.శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్ ను ఆవిష్కరించి ఆయన తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రచ్చ బండ కార్యక్రమం లోపు అన్ని గ్రామాలలో పూర్తి స్థాయిగా అన్ని కమిటీల నియామకం జరగాలని,ఆ బాధ్యత మండల స్థాయి నాయకులమీద ఉందని అన్నారు.అన్న తమ్ముళ్ల మధ్య ఉన్న అరమరికలే, అందరి మధ్య వుంటాయని మనస్పర్థలు వీడి గ్రామాలలో తగ్గేదేలే అన్నట్లుగా జగనన్న జెండా ఎగురావేయాలని అన్నారు. మన నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడ్డ త్యాగపూరితమైన కార్యకర్తలు జగనన్న కోసం సైనికులుగా శ్రమిస్తున్నారని, వారి కష్టం వృధా కాదని తగిన గుర్తింపు తప్పక వస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పంచాయితీ నిధులను దోచుకుంటు గ్రామ అభివృద్ధిని మరిచారాని, వారి పాపాల చిట్టా బహిర్గతం కాక తప్పదని అన్నారు. అవినీతి అధికారుల పాపాలపై తుపాకీ పెట్టక తప్పదని,ప్రజలే జన బాహుళ్యంలో నిలపెట్టి శిక్ష విదిస్తారని అన్నారు. నర్సిపట్నంలో జరిగిన జగనన్న మెడికల్ కళాశాల పర్యటన యావత్ ప్రపంచం చూసిందని, కూటమి ప్రభుత్వ కుట్రలు బహిర్గతం అయ్యాయని, చంద్రబాబు బొల్లు కథలు ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. తమ పార్టీ అధినేత జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాలతో మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణను వ్యతిరేక్కిద్దామని అన్నారు. సంతకం ప్రతి మనిషి అభిప్రాయమని మన సంతకమే పీపీపీ పై వ్యతిరేకనినాదామని, ప్రజలకు వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని దూరం చేస్తున్నా కూటమి కుట్రలను త్రిప్పికొడదాం అన్నారు. మూడేళ్ళ కాలంలోనే 17మెడికల్ కళాశాలలను మన రాష్ట్రానికి జగనన్న తీసుకువస్తే. వాటిని లోపాయకార ఒప్పొందాలతో ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలోజడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్, రాష్ట్ర మహిళా నాయకురాలు ఉడుముల అరుణ,వైస్సార్సీపీ పట్టణ కార్యదర్శి కందూరి కాశీ విశ్వానాద్, మండలకన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, కృష్ణారెడ్డి,దోమకాయల వెంకటేశ్వర్లు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి సయ్యద్ జబివుల్లా, సర్పంచ్ రామావత్ అరుణ బాయి, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన అబ్రహాం


**మార్కాపురం టౌన్ పెన్ పవర్ అక్టోబర్ 11**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.సచివాలయ అధికారులతో కలిసి టిడిపి ప్రధాన కార్యదర్శి మాకం అబ్రహం,,మాజీ సర్పంచ్ రామిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి గాలిబ్, డీలర్ యల్లయ్య, తెలుగుదేశం నాయకులు, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.



## రాజుపాలెంలో ఉత్సాహంగా సాగిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం

### వినియోగదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేసి ప్రారంభించిన గోడి ఓబుల్ రెడ్డి.



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 11**

కొమరోలు మండలంలో శనివారం ప్రారంభమైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రాజుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులు రేషన్ షాపుల ద్వారా రేషన్ సులభతరంగా పొందేందుకు ,రేషన్ షాపులలో అక్రమాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. కావున వినియోగదారులు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. ఆ కార్యక్రమంలో ఆ గ్రామ డీలర్ హాటేల్ పీరా, గ్రామ పెద్దలు, వినియోగదారులు పాల్గొన్నారు.

## బాణాసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి ఎస్.ఐ శ్రీకాంత్




**కొనకనమిట్ల పెన్ పవర్ అక్టోబర్ 11**

దీపావళి పండుగ సందర్భంగా మండల పరిధిలో బాణాసంచా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు కొనకనమిట్ల ఎస్.ఐ శ్రీకాంత్ తెలిపారు.అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు నిర్వహించడం లేదా అక్రమంగా బాణాసంచా నిల్వ చేయడం చట్టపరంగా నేరమని ఆయన హెచ్చరించారు.అనుమతులు పొందకుండా వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే బాణాసంచా నిల్వ కేంద్రాలు, విక్రయాలు నివాసాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని అగ్ని ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని దుకాణదారులు తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని ఎస్.ఐ శ్రీకాంత్ సూచించారు.అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బాల్య వివాహాలను అరికడదాం డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

బాల్య వివాహాలను అరికడదాం బాలికల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిడిపిఓ షేక్ ఆశా బేగం అధ్యక్షతన అంతర్జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంను శనివారం మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో నిర్వహించారు ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు సిఎస్పురం మండల పార్టీ మాజీ అధ్యక్షులుశ్రీ డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలికలు రానున్న రోజుల్లో అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే బాలిక విద్యా చాలా అవసరమని చిన్న వయసులో వారికి వివాహాలు చేయడంవలన వారు శారీరక మానసిక ఆర్థిక సామాజిక విషయాల్లో అభివృద్ధిని స్వేచ్ఛను కోల్పోతారని ప్రభుత్వము నుండి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సిడిపిఓ షేక్ ఆశా బేగం మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు మానసికంగా శారీరక అభివృద్ధి పొందాలంటే పౌష్టిక ఆహారము తీసుకోవాలని, ఇందులో అవగాహనలో భాగంగా నెల రోజులు పాటు పోషణ మహా మాస ఉత్సవాలు జరుపుతున్నామని తెలియజేశారు గ్రామంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాల్య వివాహాలు జరగకుండా గ్రామస్థాయి కమిటీలు పర్యవేక్షించాలని వివాహాలు చేసేవారు వివాహానికి ముందు వారి వయసు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలని,చట్టాలపై చైతన్యవంతులు చేయాలని కోరారు అనంతరం టాటా ట్రస్ట్ కో ఆర్డినేటర్ డి.గోపి ఆధ్వర్యంలో వారి బృందం కళాజాతను నిర్వహించారు. తదుపరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులుగా డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ను నియమించిన సందర్భంగా శాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ, స్థానిక సంఘ కాపరి గంధం దైవకటాక్షం, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గంధం సామ్యూల్, ఆక్టివ్ సూపర్వైజర్ రజిని, సరళ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు కవిత, పెద్దక్క, భాగ్యలక్ష్మి, రవణమ్మ, మిల్కా అమరావతి, రమాదేవి, శైలజ, లక్ష్మమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పన్ను తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు చేరాలి

**- డీలర్లకు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సూచన**






**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ అక్టోబర్ 11**

ఆహార పదార్థాలు, వినియోగవస్తులు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, మందులు, మెడికల్ కిట్లు మొదలైన వాటిపై జిఎస్టి రేట్లు గణనీయంగా తగ్గాయని అందువలన ఈ పన్ను తగ్గింపు ప్రయోజనాన్ని డీలర్లు ప్రజలకు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల శ్రీ వీరాంజనేయ స్వామి కోరారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గ్రేట్ ప్రకాశం డిస్ట్రిక్ట్ షాపింగ్ ఫెస్టివల్ రెండో రోజు మంత్రి డా.డోలా సందర్శించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు తో వ్యాపారులు తమ అమ్మకాలను పెంచుకోవాలని షాపింగ్ వినియోగదారులకు వ్యాపారానికి ఒక గొప్ప అవకాశం అని దసరా దీపావళి ప్రత్యేక డిస్కౌంట్లతో కలిపి జీఎస్టీ 2.0 సంస్కరణల కారణంగా వినియోగదారుడు తగ్గింపు రేట్లు ఆస్వాదించవచ్చని ఆయన పేర్కొన్నారు. వాణిజ్యం, వ్యాపార మార్కెటింగ్ కోసం ఈ షాపింగ్ పండుగను ఉపయోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజబాబు పేర్కొన్నారు. అనంతరం కొత్త బుల్లెట్ మోటార్ సైకిల్ కొనుగోలు చేసిన కస్టమర్ కు మంత్రి సిరిమోనియల్ కీ ని అందజేశారు. కస్టమర్ కొనుగోలు చేసిన టీవీ ని కూడా మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎం.సత్య ప్రకాష్, ఒంగోలు-1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఒంగోలు-2 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ కోటేశ్వరరావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఒంగోలు ఏపి ఐఐసి అధికారులు, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో సత్తా చాటిన డి జి పేట పాఠశాల విద్యార్థులు

**గెలుపొందిన విద్యార్థులకు మెమేంటోస్, మెడల్స్ అందజేత కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ జె ప్రసాదరావు**



**సి ఎస్ పురం, పెన్ పవర్, అక్టోబర్ 11**

మండలంలోని దర్శిగుంటపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 69 వ మండల స్థాయి పాఠశాలల క్రీడ పోటీలను నిర్వహించారు ముగింపు వేడుకలలో క్రీడ పోటీలలో సత్తా చాటిన దర్శిగుంట పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 4 ప్రథమ బహుమతులు,1 ద్వితీయ బహుమతి గెలుపొంది ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు గెలుపొందిన జట్లకు శనివారం మెమెంటోస్, మెడల్స్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ జె ప్రసాదరావు మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల పోటీలు ఎంతో ముఖ్యమని, ఆటలు శారీరిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు క్రీడలలో రాణించిన వారికి ఎంతటి పోటీనైనా తట్టుకునే శక్తి ఉంటుందని వారు భవిష్యత్తులో రాణిస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రసూల్, డి వెంకటేశ్వర్లు, కె వెంకటేశ్వర్లు, షేక్ షరీఫ్ గ్రామస్తులు పావలి తిరుపతయ్య, గోదాసు జయరాములు, ఉర్లగంటి శ్రీనివాసులు, పావలి శ్రీహరి, ఆలూరి మల్లికార్జున, ఆలూరి బాలకొండయ్య, తులాబందుల సుబ్బయ్య, షేక్ అబ్దుల్, ఊటుకూరి ప్రసాదు, పాఠశాలలో ఉపాధ్యాయులు దండే శ్రీనివాసులు, జి వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, చాంద్ బాషా, వెంకటరమణ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య పీఈటీలు చంద్ర, నాయబ్ రసూల్, చందన, రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన తాసిల్దార్ భాగ్యలక్ష్మి ,కూటమి పార్టీల నేతలు.

**మండలంలోని అన్ని రేషన్ షాపులలో ప్రారంభమైన స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమం.**





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 11**

పాత రేషన్ కార్డుల స్థానంలో వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమాలు శనివారం కొమరోలు మండలంలోని అన్ని చౌక ధరల దుకాణాలలో ప్రారంభమయ్యాయి. రేషన్ వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆశయంతోపాటు రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకున్నది. అందులో భాగంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ స్మార్ట్ కార్డులను ముద్రించి కొమరోలు మండలానికి అవసరమైన స్మార్ట్ రేషన్ కార్డులను ఇటీవల సరఫరా చేసింది .వాటిని స్థానిక తాసిల్దార్ భాగ్యలక్ష్మి డీలర్లకు పంపిణీ చేసి వాటిని వినియోగదారులకు అందించాలని ఆదేశించారు .కాగా వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాలను శనివారం మండలం లోని అన్ని రేషన్ షాపులలో ప్రారంభించారు. కొమరోలు 1,2 రేషన్ షాపులో, తాతిరెడ్డిపల్లి తదితర రేషన్ షాపులలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను తాసిల్దార్ భాగ్యలక్ష్మి ,కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి తదితర నాయకులు ప్రారంభించారు .ఆ సందర్భంగా వారు వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ,తద్వారా ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ,రేషన్ సులభతరంగా తీసుకునేందుకు అవకాశం ఉండటంతో ,పాటు రేషన్ షాపులలో అక్రమాలను నివారించేందుకు స్మార్ట్ కార్డులు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఆ కార్యక్రమాలలో తాసిల్దార్ భాగ్యలక్ష్మి, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ,కొమరోలు వీఆర్వోలు ఎం పాండు ,ఎల్ వై వి రమణ రావు , హనీషా ,డీలర్లు ఎలీషా, సుజాత ,కృష్ణమోహన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి ,పులకుర్తి వెంకటేశ్వర్లు బిజ్జం నరసింహులు, వార్డు మెంబర్ షేక్ సుభాని ,యువ నాయకులు నాయబ్ రసూల్ ,బిన్నీ భాష తోపాటు పలువురు కూటమి పార్టీలనేతలు పాల్గొన్నారు. కాగా కొమరోలు మండలంలోని అన్ని రేషన్ షాపులలో వీఆర్వోల ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమం చురుకుగా, ఉత్సాహంగా సాగింది.

## ఆయుర్వేద వైద్యానికి ఆదరణ డాక్టర్ పుండరీకాక్షారావు




**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మండలంలోని అరివేముల గ్రామంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో శనివారం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పుండరీకాక్షారావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాను రాను ఆయుర్వేద వైద్యానికి ప్రజల్లో ఆదరణ గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. ఆరోగ్య మందిరానికి చుట్టుపక్కల గ్రామాలే కాకుండా మండలంలోని నల్లమడుగుల, చింతలపాలెం, చెర్లోపల్లి, ఉప్పలపాడు, గుంత చెన్నంపల్లి, పెద్ద గోగులపల్లి, శీలంవారిపల్లి తదితర గ్రామాల ప్రజలు చికిత్స కోసం వస్తున్నారని తెలిపారు ఆయుర్వేద వైద్యం ప్రజల ఆరోగ్యానికి దోహదపడుతుందని, ఆయుర్వేద మందుల వలన ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయని అన్నారు చికిత్స కొరకు వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని తద్వారా సేవలు వేగవంతంగా అందించవచ్చని సూచించారు. ఆయుర్వేద వైద్య పద్ధతులపై ప్రజల్లో అవగాహన పెరిగి, సహజ చికిత్సా విధానాల వైపు మళ్లడం సానుకూల పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. చికిత్సకు వచ్చిన ప్రజలు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను పరిశీలించి ఉచితంగా మందులు అందించడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపశమనం లభిస్తుందని, మందుల ద్వారా అనేక వ్యాధులు నయమైతున్నాయని అన్నారు. డాక్టర్ వెంట ఆయుష్ సిబ్బంది మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.

## టిడిపి పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో మండల టిడిపి నాయకులు ప్రోత్సాహంతో మండల కేంద్రంలోని సి ఎస్ పురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గా బత్తుల వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి గా రేనాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మన్నేపల్లి మహేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గా తోట మురళి, మనిగం శ్రీరాములు, నాయుడు నారాయణ, కార్యదర్శులుగా గౌరిగె బాబు, ఉద్ది వెంకటరమణయ్య, బొబ్బూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కోనంకి శ్రీరాములు ఎంపికైనట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి ఆదేశాలు జారీ చేసినట్లు పట్టణ అధ్యక్ష కార్యదర్శి బత్తుల వెంకటాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సందర్భంగా బత్తుల వెంకటాద్రి, రేనాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ మండల టిడిపి నాయకులు మాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు పార్టీ బలోపాతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు ఈ సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు నూతన కమిటీని అభినందించారు.

## కస్సెట్టి, గజ్జలకొండ వారి నూతన వధూవరులను ఆశీర్వదించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**అశోక రెడ్డికి స్వాగతం పలికి ఆహ్వానించిన వివాహ మహోత్సవ పెద్దలు.**

**అధిక సంఖ్యలో పాల్గొన్న కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు.**



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 11**

కొమరోలు లోని చెక్పోస్ట్ సమీపంలో శనివారం జరిగిన కసెట్టి, గజ్జలకొండ వారి వివాహ మహోత్సవ వేడుకలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి తదితర



నేతలు కార్యకర్తలు హాజరై నూతన వధూవరులపై అక్షింతలు చల్లి ఆశీర్వదించారు .కొమరోలు పట్టణానికి చెందిన కస్సెట్టి హుస్సేనయ్య కుమారుడు, స్వర్గీయ గజ్జలకొండ సుబ్బయ్య కుమార్తె వివాహ మహోత్సవ వేడుకలు శనివారం రంగ రంగ వైభవంగా జరిగాయి .ఆ వేడుకలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ,కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి ,గిద్దలూరు మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్లు బిజ్జాల తిరుమలరెడ్డి ,షేక్ హసీనా, డైరెక్టర్,జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గజ్జలకొండ నారాయణ, భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి పాతకోట బ్రహ్మానంద రెడ్డి , కొమరోలు సహకార సంఘం మాజీ అధ్యక్షులు గజ్జలకొండ వెంకటేశ్వర్లు , కాంట్రాక్టర్ బండి తిరుమల నాథ్ ,గజ్జలకొండ సత్యం, గజ్జలకొండ నాగరాజు తో పాటు పలువురు తెలుగుదేశం, జనసేన బిజెపి పార్టీల నేతలు కార్యకర్తలు హాజరై నూతన వధూవరులపై అక్షింతలు చల్లి ఆశీర్వదించారు .ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన పలహార విందులో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ,సంజీవరెడ్డి కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు .వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని, సంజీవరెడ్డిని ,శంకర్ రెడ్డి తదితరులను వివాహ మహోత్సవ వేడుకల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## కేజీబీవీ ఉపాధ్యాయినీలు పార్వతి, నళిని లను అభినందించిన ప్రిన్సిపాల్ షేక్ రేష్మ

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 11**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సి.ఆర్.టి. సోషల్ ఉపాధ్యాయురాలు కె.పార్వతి, పిజిటి బోటనీ ఉపాధ్యాయురాలు పి.నళిని ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ షేక్ రేష్మతో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షేక్ రేష్మ మాట్లాడుతూ డీఎస్సీలో ఎంపికై చీరాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని అక్టోబర్ 10న పూర్తిచేసినట్లు తెలిపారు. విద్యాలయ సిబ్బంది మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని ఆకాంక్షించారు.

# రుషికొండను ఏం చేద్దాం



**విశాఖపట్టణం, అక్టోబరు 11, పెన్ పవర్:** విశాఖ రుషికొండ భవనాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ భవనాల వినియోగం విషయంలో ఏపీ ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతోంది. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏపీ ప్రభుత్వానికి ఏర్పడింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో 500 కోట్ల రూపాయలతో రుషికొండ భవనాలను నిర్మించారు. కానీ ఎందుకు నిర్మించారో అధికారికంగా ప్రకటించలేదు వైసీపీ ప్రభుత్వం. అయితే అది ముఖ్యమంత్రి పరిపాలన కార్యాలయంగా భావించి నిర్మించారని.. అందులో తప్పు ఏముందని అప్పట్లో వైసీపీ నేతలు ప్రశ్నించేవారు. కానీ ఇప్పుడు దానిపై కనీసం కూడా మాట్లాడడం లేదు.విశాఖలో ల్యాండ్ మార్క్.. విశాఖలో రిషికొండ అనేది ఒక ల్యాండ్ మార్క్. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం. అక్కడ కొండను గుల్ల చేసి పర్యాటక ఆనవాళ్లను తొలగించారు. భారీ భవంతులను నిర్మించారు. పర్యాటక శాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు పూర్తి చేశారు. కానీ ఫలానా కోసం నిర్మాణాలు అని చెప్పలేకపోయారు. పనులు పూర్తి చేసి ప్రారంభించలేకపోయారు. విశాఖ పాలనా రాజధానిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అది ముఖ్యమంత్రి కార్యాలయం కోసమేనని అప్పట్లో మంత్రులు ఒకరిద్దరు ప్రకటించారు. కానీ అధికారికంగా ప్రకటించేందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం ముందుకు రాలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీ గెలిచి ఉంటే మాత్రం ఆ భవనాల నుంచి ముఖ్యమంత్రి తప్పకుండా ప్రారంభించి ఉండేది అన్నది బహిరంగ రహస్యం.అయితే కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతోంది. కానీ రుషికొండ భవనాల వినియోగం విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. మొన్న ఆ మధ్యన సినిమాల చిత్రీకరణతో పాటు సినీ పరిశ్రమకు సంబంధించి ఉపయోగించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగింది. పర్యాటక రంగంలో పేరు మోసిన సంస్థలకు అద్దెకు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. ఆపై పర్యాటక అతిథి గృహాలుగా, భారీ ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదనలు కూడా వచ్చాయి. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు.తాజాగా ఈరోజు క్యాబినెట్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో రుషికొండ భవనాలపై మరోసారి చర్చ జరిగింది. భవనాల నిర్వహణ, విద్యుత్ చార్జీలకు నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని.. గతంలో రుషికొండ పర్యాటక ప్రాంతం ద్వారా నెలకు కోటి రూపాయలు ఆదాయం సమకూరేదని మంత్రులు ప్రస్తావించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో సీఎం చంద్రబాబు ప్రజాభిప్రాయం కోసం ప్రకటనలు ఇవ్వాలని.. ప్రజలు కోరుకున్న విధంగానే రుషికొండ భవనాలను వినియోగించుకుందామని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే రుషికొండ భవనాల విషయం అటు తిరిగి ఇటు తిరిగి ప్రజల చేతుల్లోకి వెళ్లడం విశేషం.

# కమలం లో వినిపించని సౌండ్




**ఏలూరు అక్టోబరు 11, పెన్ పవర్:** ఏపీ బీజేపీలో ఏ స్వరాలూ%ొ% వినిపించడం లేదు ఎందుకు? పార్టీలో పూర్తిస్థాయి స్తబ్దత పెరిగిపోవడానికి కారణాలేంటి? చివరికి అధికార ప్రతినిధులు కూడా అధికారికంగా ఎందుకు మాట్లాడలేకపోతున్నారు? వాళ్ళ గొంతులకు అడ్డుపడుతున్నదేంటి? ఎంత అధికార కూటమిలో భాగస్వామి అయినా%ొ% కనీసమైన రాజకీయ స్పందనలు కరవవడానికి కారణాలేంటి?ఏపీ బీజేపీలో ఎవ్వరూ సౌండ్ చేయడం లేదు. పార్టీ అధికార ప్రతినిధులైతే%ొ% అసలే మాట్లాడ్డం లేదు. స్పందించాల్సిన, నోరు తెరవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి. కానీ%ొ%అంతా చూద్దాం%ొ% చేద్దాం అన్నట్టు నిర్లిప్తంగా ఉంటున్నారట. ఈ తీరు క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను అయోమయంలోకి నెడుతోందన్న చర్చ నడుస్తోంది పార్టీ సర్కిల్స్‌లో. ఎవరి సంగతి ఎలాఉన్నా%ొ% కనీసం అధికార ప్రతినిధులైనా మాట్లాడాలి కదా..? వాళ్ళెందుకు రియాక్ట్ అవడం లేదు? అలా ఎందుకు జరుగుతోందని ఆరా తీస్తే%ొ% అంతా అధ్యక్షులవారి మహిమ అన్న సమాధానం వస్తోందట. మేం కూడా మా అధ్యక్షుడిని ఫాలో అయిపోతున్నాంలే.ఆయనగారికి లేని దురద మాకెందుకంటూ సన్నిహితుల దగ్గర అంటున్నట్టు సమాచారం. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవే ఏ విషయంలోనూ ఓపెన్‌గా మాట్లాడ్డం లేదు%ొ% ఇక మేమేం నోరు తెరుస్తామని అంటున్నట్టు సమాచారం. మాధవ్ ఎప్పటికప్పుడు సిద్ధాంతాల గురించి చెప్పడమే తప్ప%ొ%క్షేత్ర స్థాయిలో రాజకీయ కార్యాచరణపై దృష్టి పెట్టడం లేదన్న అసంతృప్తి ఉందట ఏపీ బీజేపీ వర్గాల్లో. ఆయన జిల్లాల పర్యటనల్లో కూడా సిద్ధాంత పరమైన చర్చలే తప్ప%ొ% రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, రాజకీయంగా ఉనికి చాటుకోవడం లాంటి అంశాల మీద దృష్టి సారించడం లేదని చెప్పుకుంటున్నారు. ఇటీవల కూటమి కార్యక్రమాల్లో సైతం ఆయన ఫాలోయర్‌లా కనిపిస్తున్నారే తప్ప%ొ% రాష్ట్ర అధ్యక్షుడిగా బీజేపీ వాయిస్ వినిపించడంలో వెనకబడుతున్నారన్న అభిప్రాయం బలపడుతోందట.ఆయన ఎందుకు అలా ఉంటున్నారో తెలీక పార్టీ మిగతా నేతలు సతమతం అవుతున్నట్టు సమాచారం. కేంద్రం ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తేనో, పథకం ప్రారంభిస్తేనో తప్ప%ొ% రాష్ట్ర పార్టీకంటూ ప్రత్యేక కార్యాచరణ లేకుండా పోయిందని, అదే పెద్ద మైనస్ అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది కేడర్‌లో. రాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో, అధికార కూటమి భాగస్వామిగా తామేం చేయాలో కూడా క్లారిటీ లేకుండా పోయిందని, ఇదంతా అధ్యక్షుడి ఉదాసీనత వల్లేనన్న చర్చ జరుగుతోందట కమలం వర్గాల్లో. ఏపీ బీజేపీ అధ్యక్షుడు స్పీడు పెంచకపోతే క్షేత్రస్థాయి బలోపేతం కావడం సంగతి తర్వాత%ొ% ఉన్న అరకొర బలం కూడా తుడిచిపెట్టుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కార్యకర్తలు.

# నారా లోకేశ్ మంత్రులకు క్లాస్

**విజయవాడ, అక్టోబరు 11, పెన్ పవర్:**
మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులకు క్లాస్ పీకినట్లు తెలిసింది. మంత్రులు పట్టీపట్టనట్లు వ్యవహరంచడం పట్ల లోకేశ్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ సమావేశం అయిన వెంటనే హడావిడిగా నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లారు. అయితే లోకేశ్ మాత్రం టీడీపీకి చెందిన మంత్రుల ఉదాసీన వైఖరిపట్ల సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకలచెరువు కల్తీ మద్యం కేసులో ప్రభుత్వం నిందితులందరినీ అరెస్ట్ చేసినప్పటికీ ప్రతిపక్ష వైసీపీ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రులు తగిన రీతిలో ఖండించలేకపోయారని లోకేశ్ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అంతటా కల్తీ మద్యం సరఫరా అయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నప్పటికీ మంత్రులు సరైన రీతిలో స్పందించలేదని ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎవరి శాఖకు సంబంధించిన వ్యవహారాన్ని వారు ఖండిస్తారనుకోవడం పొరపాటని, మంత్రులు తమ జిల్లాలకు వెళ్లి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జరుగుతున్న దుష్ప్రచారాన్ని వెల్లడించి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. జిల్లాలకు వెళ్లినా తమకు సంబంధం లేదని వ్యవహరించడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశముందని కూడా మంత్రులను ల్కోేశ్ హెచ్చరించినట్లు తెలిసింది. ప్రతిదీ స్క్రిప్ట్ ప్రకారం వెళ్లాలంటే ఎలా? కొందరు మంత్రులను నిలదీసినట్లు సమాచారం. కల్తీ మద్యం కేసులో ఉన్నది తెలుగుదేశం పార్టీ వాళ్లని తెలిసి వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, అదే సమయంలో తమ



హయాంలోనే ఈ కల్తీ మద్యం బయట పడిన విషయాన్ని సమర్థవంతంగా ప్రజలకు తెలియజెప్పడంలో మంత్రులు ఫెయిల్యూర్ స్పష్టంగా కనిపిస్తుందని నారా లోకేశ్ అన్నట్లు తెలిసింది. తమకు ఎందుకులే అని పట్టీపట్టనట్లు ఉంటే ప్రభుత్వానికే కాకుండా, పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందని, ప్రతిపక్ష వైసీపీ దానిని అడ్వాంటేజీగా తీసుకుని జనంలోకి బాగా తీసుకెళ్లగలిగిందని కూడా లోకేశ్ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు ఎన్ని సార్లు హెచ్చరించినా ఇంకా మార్పులు లేకపోతే ఎలా అని కొందరిని నేరుగానే ప్రశ్నించారని చెబుతున్నారు. మొత్తం మీద నారా లోకేశ్ మంత్రుల వ్యవహారశైలిపై నారాజ్ అయినట్లు చెబుతున్నారు. మరొకవైపు చిత్తూరు జిల్లాటీడీపీ నేతలు కూడా స్పందించపోవడంపై నారా లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం.

# మోహన్ బాబు స్టోరీలో అదే నీతా

**తిరుపతి, అక్టోబరు 11,పెన్ పవర్:**
కర్మ రిటర్న్స్ అన్న సిద్ధాంతం సినీ నటుడు మోహన్‌బాబుకు అతికినట్టు సరిపోతుందన్న అభిప్రాయం బలపడుతోంది వివిధ వర్గాల్లో. బాబూ%ొ% మోహన్ బాబూ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవయ్యా%ొ%. ఇక కాస్కో అని ఏపీ ప్రభుత్వ పెద్దలు కూడా సంకేతాలు పంపుతున్నట్టు అంచనా వేస్తున్నారు తాజా పరిస్థితుల్ని దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. ఇక అసలు విషయానికొస్తే%ొ%.. దాదాపు దశాబ్దానికి పైగా టీడీపీ అధినేత చంద్రబాబు, మోహన్ బాబు మధ్య మాటల్లేవ్. గతంలో తెలుగుదేశం పార్టీకి సొంత మనిషిలా ఉండే మోహన్ బాబు%ొ%ఆ తర్వాత రకరకాల కారణాలతో దూరమై చాలా కాలంగా పార్టీతో, చంద్రబాబుతో విభేదిస్తున్నారు. ఆ క్రమంలోనే%ొ% 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీకి జై కొట్టారాయన. అదే ఊపులో అప్పుడు సీఎం చంద్రబాబును గట్టిగా టార్గెట్ చేశారు.ఇంకా చెప్పాలంటేనాడు టీడీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేశారన్నది ఎక్కువ మంది అభిప్రాయం. కానీ%ొ% వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీతో కూడా టచ్ మీ నాట్ అన్నట్లుగానే ఉన్నారు. అందుకు కారణాలు కూడా చాలానే ఉన్నాయట. తాను కోరుకున్న ఫ్యాన్ పార్టీ అధికారంలోకి రాగానే టీటీడీ ఛైర్మన్ లేదా రాజ్యసభ సీటు ఆశించారట మోహన్‌బాబు. ఆ రెండూ కాకున్నా%ొ% చివరికి ఫిలిం డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మన్ పదవి అయినా కావాలని తెగ ఆరాటపడ్డారట అప్పట్లో. కానీ%ొ% నో యూజ్. ఏ పదవీ దక్కలేదు. పైగా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిల కోసమైతే%ొ% తాను విద్యార్థులతో కలిసి రోడ్డెక్కారో%ొ% ఆ బకాయిల్ని కూడా పూర్తి స్థాయిలో ఇప్పించుకోలేక ఛీ ఇదా నా పరిస్థితి అంటూ చతికిలపడ్డారట పెదరాయుడు. జగన్ దగ్గర నా పరపతి అరచేతి మందాన ఉందని గొప్పలకు పోయిన మోహన్‌బాబుకు చివరికి తత్వం బోధపడి మెల్లిగా బీజేపీకి దగ్గరైనట్టు చెప్పుకుంటారు. తన విద్యా సంస్థలకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ విషయంలో 2019 ఎన్నికలకు ముందు మోహన్ బాబు చేసిన హంగామా అంతా ఇంతా కాదు.నాటి టీడీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ%ొ%.విద్యార్థులతో కలిసి నడి రోడ్డు మీద కూర్చుని మోహన్‌బాబు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఆ విషయాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుని ఫైరైపోతుంటారు తమ్ముళ్ళు. ఆ ఎపిసోడ్‌లో ప్రతిపక్షంగా వైసీపీ చేసిన హడావిడికంటే%ొ%మోహన్‌బాబే చాలా ఎక్కువ చేశారన్న అభిప్రాయం ఇప్పటికీ బలంగా ఉందట ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం కేడర్‌లో. అందుకే ప్రస్తుతం ఆయన తమ మిత్రపక్షం బీజేపీకి దగ్గరైనా%ొ% సంబంధంలేని వ్యక్తిగానే చూస్తుంటారు. అదే సమయంలో మోహన్‌బాబు విషయంలో సీఎం చంద్రబాబు మెతక వైఖరి అవలంభిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసే టీడీపీ లీడర్స్‌కు



కూడా కొదవ లేదు. చంద్రబాబు వైఖరి వల్లే%ొ% ఛాన్స్ దొరికినప్పుడల్లా మోహన్ బాబు టీడీపీ మీద విషం చిమ్ముతూ ఉంటారని బహిరంగంగానే విమర్శిస్తుంటారు తమ్ముళ్ళు. కానీ%ొ% అదంతా పాత లెక్క అని చెబుతున్నాయట తాజా పరిణామాలు. పెదరాయుడికి ఊహించని షాక్ ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. ఇది చూసిన కొందరు టీడీపీ కార్యకర్తలు అవునా%ొ% నిజమా%ొ% అని ముక్కున వేలేసుకుంటుంటే%ొ% ఇంకొందరు మాత్రం ఓ అడుగు ముందుకేసి ఇప్పటిదాకా ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క అంటూ సినిమా డైలాగ్స్ చెప్పేస్తున్నారటగతంలో ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కి చంద్రబాబు, టీడీపీ మీద పెద్ద ఎత్తున విమర్శలు చేశారో%ొ% అవే నిధులు, కాలేజ్ ఫీజుల మళ్ళింపు వ్యవహారంలో ఇప్పుడు మోహన్‌బాబు ఇరుక్కోవడం చూసి కర్మ రిటర్న్స్ అంటే ఇదేనంటూ కామెంట్స్ చేస్తున్నారు టీడీపీ కార్యకర్తలు. మోహన్‌బాబు యూనివర్శిటీలో తమ దగ్గర అడ్డసుడిగా డబ్బులు పిండుకుంటున్నారంటూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించింది ఉన్నత విద్యామండలి. విచారణ తర్వాత కాలేజీ మూసివేత, 15 లక్షల రూపాయల ఫైన్ తో పాటు విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు సొమ్ము 26 కోట్ల రూపాయలను 15 రోజుల లోపు తిరిగి చెల్లించాలని చెప్పడం మోహన్‌బాబు ఊహించని షాకేనంటున్నారు. దీంతో అవాక్కయిన టీడీపీ కేడర్%ొ% ఇది నిజంగా మన ప్రభుత్వమేనా? అలాంటి చర్యలకు ఆదేశించింది నిజమేనా అంటూ తమను తాము గిల్లి చూసుకుంటున్నారట.కొద్దిమంది చిత్తూరు జిల్లా సీనియర్స్ అయితే%ొ% ఈ విషయంలో చంద్రబాబు ప్రమేయం పెద్దగా ఉండకపోవచ్చని, అంతకు మించి లోకేష్ పూనుకుని గట్టిగా వ్యవహరించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పడానికి కూడా భయపడాల్సిన అవసరం లేదని, లోకేష్ ఆదేశాలతోనే ఉన్నత విద్యా మండలి స్వేచ్ఛగా విచారణ జరిపి ఈ తరహాలో కఠిన నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం ఉంది సీనియర్స్‌లో. మోహన్ బాబు గతంలో ఎలా వ్యవహరించాడో%ొ% అందరికీ తెలుసు కాబట్టే%ొ%. లోకేష్ తండ్రిలా కాకుండా %ొ%. ఛాన్స్ దొరికింది కాబట్టి ఓ ఆటాడేసుకుంటున్నారన్న చర్చ గట్టిగా జరుగుతోంది జిల్లాలోదానికి తోడు మోహన్ బాబు రెండో కుమారుడు మంచు మనోజ్ సైతం నేరుగా లోకేష్‌ను పలుమార్లు కలసి తనతో నాన్న, అన్న ఎలా వ్యవహరించారో వివరించారట. కారణాలు ఏవైనాగానీ%ొ%. మోహన్‌బాబు విషయంలో చంద్రబాబులాగా కాకుండా%ొ%. లోకేష్ గట్టిగా నిర్ణయాలు తీసుకున్నారంటూ%ొ% ఉమ్మడి చిత్తూరు టీడీపీ కేడర్ ఖుషీగా ఉన్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా చర్చకు పెట్టేస్తున్నారు. మన్తో ఎంటర్‌టైన్‌మెంట్ మామూలుగా ఉండదు మరి అంటున్నారు టీడీపీ లీడర్స్. చినబాబు యాక్షన్‌కు పెదరాయుడు రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీవర్గాలు.

# రాధా ఫ్రెండ్ షిప్... బూమ్ రాంగ్ అవుతుందా

**విజయవాడ అక్టోబరు 11, పెన్ పవర్:** ఉమ్మడి ఏపీలో వంగవీటి కుటుంబానికి ఘనమైన చరిత్ర. వంగవీటి మోహన్ రంగా ఒక చరిత్ర సృష్టించారు. ప్రజా సంఘాల నాయకుడిగా విజయవాడలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అయ్యింది ఒక్కసారి మాత్రమే అయినా.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయ్యారు. కాపు సామాజిక వర్గానికి అండగా నిలిచారు. అందుకే ఆయన చనిపోయి మూడున్నర దశాబ్దాలు అయినా ఆయన మాత్రం తెలుగు రాజకీయాల్లో సజీవంగా ఉన్నారు. అయితే ఆయన పేరుతో రాజకీయ పార్టీలు లబ్ది పొందుతున్నాయి తప్ప.. ఆయన వారసుడు వంగవీటి రాధాకృష్ణ మాత్రం లాభపడింది తక్కువ. దానికి ఆయన స్వయంకృతాపరాధం ఉంది. మనం తీసుకునే నిర్ణయాలు.. అనుసరించే వ్యూహం బట్టి రాజకీయాల్లో రాణింపు ఉంటుంది. ఈ విషయంలో మాత్రం ఆయన తొందరపాటు చర్యలే ఆయనకు ఈ పరిస్థితికి తెచ్చిపెట్టాయి. 2004లో విద్యార్థి దశలో ఉన్నారు వంగవీటి రాధాకృష్ణ. ఆ సమయంలో పాదయాత్ర చేశారు రాజశేఖర్ రెడ్డి. వంగవీటి మోహన్ రంగ కుమారుడిగా గుర్తించి రాధాకృష్ణను ప్రోత్సహించారు. ఏకంగా అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన రాధాకృష్ణ 3 పదుల వయసు లోనే అసెంబ్లీలో అడుగుపెట్టారు. అందరి దృష్టిని ఆకర్షించగలిగారు. అయితే 2009లో ఆయన చేసిన తప్పిదం శాపంగా మారింది. ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లిపోయారు రాధాకృష్ణ. రాజశేఖర్ రెడ్డి వద్దని వారించినా వినలేదు. ప్రజారాజ్యం పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అదే ఎన్నికల్లో రెండోసారి కాంగ్రెస్ తరపున గెలిచి ఉంటే తప్పకుండా వంగవీటి రాధాకృష్ణ మంత్రి అయ్యేవారు. ఏపీ
రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదిగేవారుఅయితే అదే ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్లో విలీనం అయిన వేళ చాలా బాధపడ్డారు రాధాకృష్ణ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ తరఫున 2014 ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. వైసీపీ సైతం అధికారంలోకి రాలేదు. కనీసం రాధాకృష్ణకు గుర్తింపు దక్కలేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ టికెట్ లభించలేదు. దీంతో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు రాధాకృష్ణ. అది మొదలు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి తరుపున ప్రచారం చేశారు. అయితే చంద్రబాబుతో పాటు లోకేష్ రాధాకృష్ణకు మంచి అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. కానీ ఇప్పుడు స్నేహితుల రూపంలో ఆయనకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.వైసిపి హయాంలో కొడాలి నానితో పాటు వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందే. వారిద్దరి ప్రవర్తన పై వైసీపీలో సైతం అభ్యంతరాలు ఉన్నాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాధాకృష్ణను ఆ పార్టీలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. అదీ జరగలేదు. అయితే ఇప్పుడు రాధాకృష్ణకు మంచి అవకాశాలు దక్కే పరిస్థితి ఉన్న నేపథ్యంలో.. స్నేహం పేరిట వల్లభనేని వంశీతో పాటు నాని ఆయనను కలవడానికి టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. వైసీపీ హయాంలో అధినేత చంద్రబాబుతో పాటు లోకేష్ ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన వ్యక్తులతో వంగవీటి రాధాకృష్ణ ఎలా కలుస్తారని టిడిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ఒకవైపు రాధాకృష్ణ రాజకీయ ఎదుగుదలకు సరైన నిర్ణయాలు తీసుకోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న తరుణంలో.. తన కెరీర్ కు ఇబ్బంది కలిగించే స్నేహాన్ని దూరం పెట్టడమే మేలన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాజకీయాలు వేరు, స్నేహాలు వేరు అని అనవచ్చు. కానీ విపరీతమైన ధోరణిలతో వ్యవహరించే అటువంటి వారికి దూరంగా ఉండడం చాలా మేలు. ఈ కారణంతో వంగవీటి రాధాకృష్ణ కూటమి ప్రభుత్వంలో పదవి దక్కదు అని చెప్పలేము కానీ.. వీటిపై అభ్యంతరాలు వ్యక్తం చేసేవారు చాలామంది ఉంటారు. ఇక తెలుసుకోవాల్సింది వంగవీటి రాధాకృష్ణ.

# మూడు వికెట్లతో చెలరేగిన జడేజా.. రెండో టెస్ట్‌పై పట్టుబిగిస్తోన్న భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా వెస్టిండీస్?తో జరుగుతోన్న రెండో టెస్టుపై టీమిండియా పట్టు బిగిస్తోంది. తొలుత బ్యాటింగ్?లో దుమ్మురేపిన యంగ్ టీమిండియా.. ఆ తర్వాత బౌలింగ్?లోనూ అదరగొడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణిస్తూ.. రెండో టెస్ట్?లో కూడా విజయం దిశగా దూసుకుపోతుంది. ఓవర్ నైట్ స్కోర్ 318/2తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఇండియా సెకండ్ డే కూడా పూర్తిగా అధిపత్యం చెలాయించింది.రెండో రోజు మరో 200 పరుగులు చేసి రెండో సెషన్‌లో 518/5 స్కోరు వద్ద ఫస్ట్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది ఇండియా. ఓపెనర్ యశస్వీ జైశ్వాల్ (175), కెప్టెన్ గిల్ (129 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కగా.. సాయి సుదర్శన్ (87), కేఎల్ రాహుల్ (38), నితీశ్‌కుమార్ రెడ్డి (43) రాణించారు. వెస్టిండీస్ బౌలర్లలలో వారికన్ 3, రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్.. భారత బ్యాటర్లు పరుగుల వరద పారించిన పిచ్?పై రన్స్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. బుమ్రా, సిరాజ్ దెబ్బకు విండీస్ ఓపెనర్లు తంగెనరైన్ చందర్‌పాల్, జాన్ క్యాంబెల్ క్రీజ్‌లో నిలదొక్కుకునేందుకు సతమతమయ్యారు. ఈ క్రమంలోనే జాన్ క్యాంబెల్ 25 బంతుల్లో 10 పరుగులు చేసి 7 ఓవర్‌లో జడేజా బౌలింగ్?లో ఔట్ అయ్యాడు. మరో ఓపెనర్ తంగెనరైన్ చందర్‌పాల్ కాస్త ధాటిగా ఆడే క్రమంలో 67 బంతుల్లో 34 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఓపెనర్లు ఇద్దరిని జడేజానే ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన అలిక్ అథనాజ్, షాయ్ హెూప్ ధాటిగా ఆడుతూ స్కోర్ బోర్డును కాసేపు పరిగెత్తించారు.

84 బంతుల్లో 41 పరుగులు చేసి క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోన్న క్రమంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్?కు చిక్కాడు అలిక్ అథనాజ్. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విండీస్ కెప్టెన్ రాస్టన్ చేజ్ జడేజా బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి డకౌట్ కావడంతో వెనువెంటనే వెస్టిండీస్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసేసరికి 140 పరుగులు

చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది విండీస్. జడేజా మూడు వికెట్లతో రాణించగా.. కుల్దీప్ ఒక వికెట్ తీశారు. ప్రస్తుతం షాయ్ హెూప్ (31) టెవిన్ ఇమ్లాచ్ (14) క్రీజులో ఉన్నారు. ఇండియా కంటే వెస్టిండీస్ ఇంకా 378 పరుగులు వెనుకబడి ఉంది. ఇండియా బౌలర్ల ఫామ్ చూస్తుంటే మూడో రోజు తొలి సెషన్?లోనే విండీస్ చాపచుట్టేసేలా కనిపిస్తున్నారు.

# గిల్ మరో రికార్డు.. కింగ్ కోహ్లీ రికార్డు సమం చేసిన యువ కెప్టెన్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యంగ్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ మరో రికార్డు సాధించాడు. టెస్టుల్లో కింగ్ కోహ్లీ రికార్డును సమం చేసి చరిత్ర సృష్టించాడు. ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు చేసి శభాష్ శుభ్ మన్ అనిపించుకుంటున్నాడు. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్ తో జరిగుతున్న రెండో టెస్టులో.. సూపర్ సెంచరీతో ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు నమోదు చేసి కోహ్లీ సరసన నిలిచాడు గిల్. వెస్టిండీస్ తో జరుతున్న రెండో టెస్టులో కెప్టెన్ గిల్ అద్భుత సెంచరీ నమోదు చేశాడు. క్లాస్ బ్యాటింగ్ తో బౌలర్లకు చుక్కలు చూపిస్తూ సెంచరీ చేసుకున్నాడు. మొత్తం 177 బంతులలో 13 ఫోర్లు, ఒక సిక్సుతో సెంచరీ పూర్తి చేశాడు. 130 వ ఓవర్లో 5వ బాల్ కు.. ఖేరీ పియరీ వేసిన బాల్ ను లెఫ్ట్ కవర్స్ వైపు పంపించి మూడు రన్స్ తీసిన గిల్.. ఈ టెస్టులో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో గిల్ కు ఇది పదో సెంచరీ. ఈ క్యాలెండర్ ఇయర్ లో ఇది ఐదో టెస్టు సెంచరీ. ఒక క్యాలెండర్ ఇయర్ లో కెప్టెన్ గిల్ ఖాతాలో 5వ టెస్టు సంచరీ నమోదు కావడం విశేషం. అంతకు ముందు ఇదే ఫీట్ ను విరాట్ కోహ్లీ వరుసగా 2017, 2018లో సాధించాడు. టెస్టులలో ఒక క్యాలెండర్ ఇయర్ లో కెప్టెన్ గా ఐదు సెంచరీలు చేసిన కోహ్లీ ఫీట్ ను సమం చేశాడు గిల్. కేవలం 7 టెస్టులలో 5 సెంచరీలు నమోదు చేయడం విశేషం.టీమ్ లో రోహిత్, కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు లేని వేళ.. కెప్టెన్సీ బాధ్యతలు అనూహ్యంగా శుభ్ మన్ గిల్ అప్పగించింది బీసీసీఐ. రోహిత్ సక్సెస్ ఫుల్ కెప్టెన్సీ తర్వాత టెస్టు కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించిన గిల్.. బీసీసీఐ నమ్మకాన్ని నిలబెట్టాడు. మొదటి టెస్టులో భారీ విజయాన్ని అందించిన గిల్.. రెండో టెస్టులో జైస్వాల్ (175)తో పాటు సెంచరీ చేసి స్కోర్ ను 500 పరుగుల మార్కును దాటించాడు.

**ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు బాదిన ఇండియా కెప్టెన్లు:**

1. విరాట్ కోహ్లీ – 2017
2. విరాట్ కోహ్లీ – 2018
3. శుభ్ మన్ గిల్ – 2025

# మ్యాచ్ విన్నింగ్ స్టార్స్‌ను చెన్నై వదులుకుంటుందా..? ఐపీఎల్ వేలం ముందు ఫ్యాన్స్‌లో ఆందోళన







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ –2026 కు సన్నాహకాలు మొదలయ్యాయి. త్వరలోనే వేలం నిర్వహించేందుకు బీసీసీఐ రెడీ అయ్యింది. ఈ క్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్ లో ఆందోళన మొదలయ్యింది. టీమ్ నుంచి దాదాపు ఐదుగురు ప్లేయర్లను వదులుకోనున్నట్లు సోషల్ మీడియాలో డిబేట్ నడుస్తోంది. అందులో మ్యాచ్ విన్నింగ్ స్టార్స్ ఉండటంపై ఫ్యాన్స్ షాకింగ్ లో ఉన్నారు. క్రిక్ బజ్ రిపోర్ట్ ప్రకారం 5 మంది ప్లేయర్లను వచ్చే సెషన్ లో చెన్నై వదులుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. అందులో సామ్ కరణ్, దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి, డెవాన్ కాన్వే పేర్లు డిస్కషన్ లోకి వచ్చాయి. ఈ లిస్టుపై ఫ్యాన్స్ లో గందరగోళం నెలకొంది. సామ్ కరణ్, కాన్వే వంటి మ్యాచ్ విన్నింగ్ స్టార్స్ ను వదులుకోవాల్సిన అవసరమేంటని సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది. ఈ గందరగోళంపై చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం స్పందించింది. ఈ రూమర్స్ కు చెక్ పెట్టేందుకు ఎక్స్ లో పోస్ట్ చేసింది. డోంట్ వర్రీ.. ఆ మ్యాటర్ గురించి అప్ డేట్ చేస్తామని పోస్ట్ చేసింది. ఇంకా అటువంటి నిర్ణయం తీసుకోలేదని.. కేవలం బయో అప్డేట్ చేసినట్లు సీఎస్కే పోస్ట్ చేసింది. దీంతో ఫాన్స్ కాస్త కూలయ్యారు. లాస్ట్ సెషన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ఘోర ఫామ్ నుంచి బయటికి వచ్చేందుకు నెక్స్ట్ సెషన్ కోసం సన్నద్ధం అవుతోంది. అందుకోసం భారీ మార్పుల దిశగా అడుగులు వేస్తున్నట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. గత సీజన్ లో మొత్తం 14 మ్యాచ్ లు ఆడిన %జూఖ% కేవలం 4 మ్యాచ్ లు గెలవడం ఫ్యాన్స్ ను తీవ్ర నిరాశలకు గురిచేసింది. దీంతో వచ్చే ఆక్షన్ కోసం రిటెన్షన్ లిస్టు రెడీ చేయాల్సి ఉంది. నవంబర్ 15 లోపు రిటెన్షన్ లిస్టు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటి వరకు ఏ అప్ డేట్ ఉన్నా షేర్ చేయనున్నట్లు చెన్నై సూపర్ కింగ్స్ ప్రకటించింది.

# స్టార్ హీరో కొడుకుతో అనుపమ డేటింగ్.. సమాధానం ఇదేనా?







మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 10ఏళ్లు కావస్తోంది. ప్రేమమ్ తో కెరీర్ ప్రారంభించిన అనపమ.. ఆ తర్వాత పలు ఇండస్ట్రీలో అవకాశాలు దక్కించుకుంది. ఫలితాలతో సంబంధం లేకుండా అనేక సినిమాల్లో నటించింది. ఆమె అందం, కర్లీ హెయిర్, మోహంలో క్యూట్ నెస్ కు కుర్రకారు ఫిదా అయిపోయారు. తమ క్రష్ లిస్ట్ లో జాయిన్ చేసుకున్నారు.అయితే సెలబ్రిటీలు అన్నాక.. వాళ్లపైనే ఎక్కువ ఫోకస్ ఉంటుంది. ఇక వాళ్ల పర్సనల్ లైఫ్ విషయాలు తెలుసుకునేందుకు అభిమానులు ఎంతగానో ఆరాటపడుతుంటారు. ఈ క్రమంలోనే వాళ్లపై పలు రకాల రూమర్స్ కూడా పుట్టుకొస్తాయి. ముఖ్యంగా అది హీరో అయినా, హీరోయిన్ అయినా వాళ్ల పెళ్లి, లవ్, రిలేషన్ షిప్ గురించే ఎక్కువ ప్రచారం జరుగుతుంటుంది.

దీనికి అనుపమ మినహాయింపేమీ కాదు. గతంలో నుంచే అనుపమ పెళ్లి, రిలేషన్ షిప్ అంటూ అనేకసార్లు ప్రచారం సాగింది. తాజాగా మరోసారి ఈ ప్రచారం జోరందుకుంది. దీనికి కారణం ఆమె ప్రస్తుతం తమిళంలో చేస్తున్న సినిమా. అనుపమ తమిళంలో తాజాగా చేసిన సినిమా బైసన్. ఇందులో అనుపమ హీరోయిన్ కాగా.. చియాన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా నటించారు. ఇది లవ్ అండ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోంది.కాగా, ఈ సినిమా షూటింగ్ సమయంలో అనుపమ– ధ్రువ్ మధ్య ఫ్రెండ్ షిప్ బాండింగ్ ఏర్పడింది. అప్పట్నుంచి ఇద్దరూ క్లోజ్ గా ఉంటున్నారని, ఈ ఇద్దరూ రిలేషన్ షిప్లో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇది సోషల్ మీడియాలోనూ వైరల్ గా మారింది. అయితే దీనిపై మీడియా డైరెక్ట్ గా అనుపమనే ప్రశ్నించింది. బైసన్ ప్రమోషన్స లో రీసెంట్ గా పాల్గొన్న అనుపమకు డేటింగ్ రూమర్స్ గురించి అడిగారు.ఈ ప్రశ్న నుంచి అనుపమ తెలివిగా తప్పించుకుంది. దీనికి సమాధానం చెప్పకుండా దాటవేస్తూ.. అందుకు బదులుగా బైసన్ సినిమాలో ధ్రువ్ నటన, డెడికేషన్ గురించి చెబుతూ ప్రశంసలు కురిపించింది. దీంతో అనుపమ తెలివిగా సమాధానం చెప్పిందని కొందరు అనగా.. మరికొందరూ నిజంగా డేటింగ్ లో ఉందా అని ఆరా తీస్తున్నారు. ఏదేమైనా దీని గురించి ఆ ఇద్దరే చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే ఓ క్లారిటీ వస్తుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com